

# తీరిక సమయంలో

- ఎమ్. శర్మా -

'నమస్కారమండి గుండూరావుగారూ! నేను పత్రికా విలేఖరిని. మిమ్మల్ని మా పత్రికలో పరిచయం చేయాలని వచ్చాను" అంటూ ఒక వ్యక్తి మా ఇంట్లోకి ప్రవేశించాడు.

నేను నోరు తెరచి ఆశ్చర్యపోయి ఆ పత్రికా విలేఖరిని చూస్తూ అన్నాను: "మీరు పొరబడి ఉంటారు. నా పేరు గుండూరావే. కాని మీ రను కున్న వ్యక్తిని కాదు. మామూలు గుమాస్తాని. ఈ వీధిలోనే మూడో నెంబరు ఇంట్లో ప్రఖ్యాత రచయితా, నటుడు, గాయకుడైన శ్రీ గుండూరావు గారు—"

నా మాట పూర్తికాకుండానే ఆ పత్రికా విలేకరి అందుకున్నాడు: "నేను మిమ్మల్ని మా పత్రికలో పరిచయం చేయాలనే వచ్చాను. ఒక మామూలు గుమాస్తా అభిరుచులు, అభిప్రాయాలు, హాబీలు మా పాఠకులకి పరిచయం చేయాలని వచ్చాను. నేను మిమ్మల్ని కొన్ని ప్రశ్న లడుగుతాను. దయచేసి జవాబులు చెప్పండి. మీకేమైనా అభ్యంతరమా?".

అతని కుడి భుజాని కున్న కెమెరా చూస్తూ— "నాకేం అభ్యంతరం లేదు. ఈ రోజు ఆదివారం. నాకు పెద్దగా పనులేం లేవు. కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాను.

అతను కూర్చుంటూ అడిగాడు—"తీరిక సమ యాల్లో మీరేం చేస్తారు?"

"తీరిక సమయమా?"

"ఎందుకలా ఆశ్చర్యపోతారు? మీ రెన్ని గంటలకి నిద్ర లేస్తారు? మీ దినచర్య కొంచెం వివరిస్తారా?" అంటూ నోట్ పుస్తకం, పెన్నూ రెడీగా పెట్టు కున్నాడు.

"తప్పకుండా వివరిస్తాను. ఉదయం నాలు గున్నరకే నిద్రలేచి ఒకటిన్నర మైలు నడిచి పాల సీసాలు తెస్తాను."

"వెరీగుడ్! మార్నింగ్ వాక్. అనంతరం వ్యాయా మం, యోగాసనాలు వగైరాలు ప్రారంభిస్తా రను కుంటాను."

"నాకు వ్యాయామం లెట్రిన్ దగ్గర క్యూలో చిందులు వేయడం."

"కొంచం వివరంగా చెప్తారా?"

"తప్పకుండా! మా ఇంట్లో ఆరు కుటుంబా లున్నాయి. అందరికీ కలిసి ఒకే ఒక లెట్రిన్ ఉంది. అందుకని నేను కాలకృత్యాలు తీర్చుకునేసరికి రేడి యోలో వార్తలు ఇంతటితో సమాప్త మవుతాయి'.

"ఆ తరవాత మీరు . కాఫీ సిప్ చేస్తూ దిన పత్రిక తిరగేస్తారు."

"సారీ! మీరు చాలా తొందర పడుతున్నారు. కాఫీ తాగి గత రాత్రి ఎలుకల బోనులో పడ్డ ఎలకల్ని వీధి చివరన వదిలేసి, బడికి వెళ్ళే పిల్లలకి పుస్తకాలు, పెన్‌లు, బస్‌పాస్‌లు వెతికిచ్చి, షేవ్ చేసుకుని స్నానం అయిందనిపించి నాలుగు మెతుకులు కొరికే సరికి రేడియోలో హోటల్ వాళ్ళు టైం చెప్తారు.'

"ఇప్పుడు మీరు తీరుబడిగా ఈజీచైర్లో కూర్చుని తాపీగా సిగరెట్ వెలిగిస్తా రనుకుంటాను."

"సారీ! నా కా తీరిక లేదు. పరుగు పందాలలో పాల్గొనే వాడిలా బస్సుస్టాప్‌కి వెళతాను."

"ఓ మై గాడ్! మీరు ఆఫీసుకి గంటన్నర ముందుగానే వెళ్తారన్న మాట. ఈ దేశ మింత అభివృద్ధి సాధించిందంటే అదంతా మీలాంటి సిన్సియర్ వర్కర్స్ ఉండటం వల్లనే. నిజంగా మీరు చాలా అభినందనీయులు."

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్స్. కాని నేను చెప్పేది పూర్తిగా వినండి. నేను అన్నం తినీ తినగానే తొమ్మిది గంటలకే ఆఫీసు కెళ్ళను. బస్సుస్టాప్‌కి వెళ్ళి క్యూలో నిలుచుంటాను. ఆఫీస్ స్పెషల్ బస్ తొమ్మిది ఇరవై నుంచి పది ఇరవై లోపలా, ఆ పైనా దానికి గుబులు పుట్టినప్పుడూ వస్తుంది."

"మధ్యలో అడుగుతున్నందుకు మీరేమీ అనుకోకండి. ఆ బస్ కోసం తొమ్మిది గంటల నుంచే తపస్సు చేయడ మెందుకు? మామూలు బస్సుల మీద మీరు ఆఫీసుకి వెళ్ళలేరా? ఈ దేశంలో బస్సులు గొడ్డు పోలేదు కదా."

"వెళ్ళవచ్చు. మామూలు బస్సులైతే మూడు చోట్ల మారాలి. స్పెషల్ బస్ ఇరవై నిమిషాల్లో నా ఆఫీసుకి చేరుస్తుంది. మామూలు బస్సుల్లో వెడితే నా నైట్ వాచర్‌కి తోడుగా ఆఫీసు వరండాలో పడుకోవలసి వస్తుంది!"

"మీరు తమాషాగా మాట్లాడుతున్నారు. ఇరవై నిమిషాల ప్రయాణంకోసం గంటన్నరకి పైగా క్యూలో నించుంటున్నారు."

"మీరు కీ సిటీ బస్సులతో అనుభవం అంతగా లేనట్టుందే! మా స్పెషల్ బస్‌కి కూడా బస్సుల జనభా ఎక్కువతారు. ఆ జనం తొక్కిడికి తట్టుకోలేక నేను సీటింగ్‌కోసం రోజూ గంటన్నరకి పైగ క్యూలో నించుంటాను. నాకు బస్‌లో మంచి నిద్ర పడుతుంది."

"మీరు చాలా మంచి విషయాలు చెబుతున్నారు. పాఠకులకి చాలా కుతూహలం కలిగించేటట్టుగా ఉంది మీ దిన చర్య. ఆ తర్వాత చెప్పండి."

"ఆఫీసుకి వెళ్ళి వెళ్ళగానే అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి, నా డ్రాయర్ సొరుగులో ఫైళ్ళన్నీ టేబిల్ మీద చిందరవందరగా పడేసి నా టిఫిన్ బాక్స్, నేను తెచ్చిన పత్రికల్ని డ్రాయర్ సొరుగులో జాగ్రత్తగా సర్ది కాంటీన్‌కి వెళతాను. అక్కడ పేపరు చూసి టీ తాగుతాను."

"తరవాత సీటుకి వచ్చి ఆఫీసు పనిలో మునిగి పోతాను."

"క్షమించండి. యదార్థం చెబుతున్నాను. మీరేమీ అనుకోకండి. పార్టీలు ఎవరైనా వస్తేనే ఫైళ్ళు చూస్తాను. లేకపోతే ఏదో పని చేస్తున్నట్లు నటిస్తూ కొలీగ్స్‌తో రాజకీయాలు చర్చిస్తాను."

"మీరు చాలా నిజాయితీగా చెబుతున్నారు."

"అంతలో ఒంటిగంట అవుతుంది. నా లైబ్రరీకి వెళ్ళి కొత్త పుస్తకాలు తీసుకుంటాను. కాఫీ టిఫెన్ పూర్తిచేసి కొత్త పత్రికలు చూస్తూ రెండు క్షణాలు కళ్ళు మూస్తాను."

"బాగుంది ... బాగుంది ... ఆ తర్వాత?"

"మళ్ళీ టీ తాగి, సిగరెట్ తగలేసి పార్టీలు ఎవరైనా వస్తే హుషారుగా పనిచేస్తాను. లేకుంటే రెండు మూడు అర్జెంట్ ఫైల్స్ రాస్తాను. నాలుగున్నరకి ఆఫీస్ పనికి స్వస్తి చెబుతాను."

"అప్పుడు ఇంచక్కా ఇంటికి బయలుదేరు తారు."

"ఇక్కడో చిన్న విషయం మరిచారు. మా స్పెషల్ బస్ ఆయిదు గంటలకి గానీ రాదు. అందుకని అయిదు గంటలదాకా ఆఫీసులో తాపట్లాడి స్పెషల్ బస్ ఎక్కుతాను."

"మీకు పగలంతా ఒక్క క్షణం కూడా తీరిక లేనట్లుగా ఉంది. మరి రాత్రివేళయినా మీకు తీరిక దొరుకుతుం దనుకుంటాను."

"మీరు పొరపడుతున్నారు. నేను ఇంటికి వెళ్ళే సరికి చీకటి పడుతుంది. నేను ఇంటికి వెళ్ళగానే మా ఆవిడ పక్కింటి పిన్నిగారు కొన్న చీర గురించీ, ఎదురింటి అత్తయ్యగారు తీసుకున్న బంగారు గొలుసు గురించీ దండకం చదువుతుంది. నేను గాత్రం పాడుతాను. మా పెద్దమ్మాయి రేడియో ఆన్ చేసి సినిమా పాటలకి తన గొంతు కలుపుతుంది. మా పెద్దాడికి పాఠాలు బిగ్గరగా చదివే అలవాటు ఉంది. చివరి వాళ్ళు మా ఇంటిని క్రీడారంగంగా మారుస్తారు. పదిన్నర వరకూ మా ఇల్లు చిన్న యుద్ధ భూమిలా ఉంటుంది."

"అయితే మీరు పదిన్నరకే నిద్ర పోతారా?"

"ఆశ్చర్యపడకండి. లైట్ ఆర్పగానే, దోమల సంగీతం ప్రారంభ మవుతుంది. దోమల్ని తోలు కుంటూ, నల్లుల్ని చంపు కుంటూంటే నల్లా (పంపు) వస్తుంది."

"ఓ మై గాడ్! మీకు పంపు అర్థ రాత్రి వస్తుందా?"

"రాత్రి పన్నెండు గంటలు దాటిన తర్వాత వస్తుంది. ఆరు బాటాల వారు పట్టుకోవాలి. మా వంతు వచ్చేసరికి తొలికోడికూస్తుంది."

"అయితే మీకు ప్రతీ రోజూ ఊపిరి సలపని కార్యక్రమాలు ఉన్నాయి. తీరిక అనేది లేదు. సెలవు రోజుల్లో ఏం చేస్తారు?"

"సెలవు రోజుల్లో క్షుర కర్మ, వెచ్చాలు తెచ్చు కోవడం, కిరసనాయిల్, రేషన్ బియ్యం వగైరాల కోసం క్యూలో నిల్చోవడం. ఎవరో ఒకరు రావడం...'

"ఇంట్లో ఎవరూ లేనట్లున్నారే?"

"మార్నింగ్ షోకి వెళ్ళారు. నే నిప్పుడే మంచాల్లో నల్లుల మందు పోసి స్నానం చేశాను. నాలుగు మెతుకులు కొరికి నడుం వాలుద్దా మంటే మీరు వచ్చారు. మిమ్మల్నెలా కాదనగలనూ చెప్పండి! మీ రిప్పుడు నా ఫోటో తీస్తా నంటారు. షేవింగ్ చేసుకోవాలి. క్రాపుకి కొంచెం కాటుక రాసుకోవాలి. నా కీ జన్మకి తీరిక దొరకదు."

"ఆగండి మాస్టారూ ఆగండి. మీరు చెప్పిన వన్నీ రాసి, మీ ఫోటో వేస్తే మీ ఉద్యోగం నా ఉద్యోగం చేసుకుని లేచి పోతాయి.

మీ కసలు లోకానుభవం లేదు. నా ఫోటో వేసి పక్కన వీరి పేరు గుండూరావుగారు. గత పదహారు సంవత్సరాలుగా గుమాస్తాగా పనిచేస్తున్నారు. వీరు ఘంటసాలగారి పాటలంటే చెవి కోసుకుంటారు. బాపు సినిమా అంటే కను రెప్పలు ఆర్పరు. శ్రీశ్రీ కవితలంటే గొంతు చించుకుంటారు ... అంటూ నాలుగు ముక్కలు రాయండి." *

దీ ప్తిమంతమైన రంగు రంగుల బ్రిల్ సిరాతో రసవత్తరమైన భావాలకు జిజ్ఞాస కలిగించుకోండి సప్త వర్ణ శ్రేణిలో:



IS.1221 ISI

బ్రిల్ సిరాతో

Bril INK

తయారుచేయువారు:
ఇండస్ట్రియల్ రీసెర్చి కార్పొరేషన్
మద్రాసు 600 041 &
బెంగళూరు 560 055

ADWAVE/IRC/1162/TEL